ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 23 డిసెంబరు 2025 www.prajaswaramdailly.com 4 pm

# విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు తరలింపు

**బెంగళూరు , ప్రజాస్వరం**

చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్ లను బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ లో నిర్వహించనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా కర్ణాటక ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్ర – ఢిల్లీ మ్యాచ్ బుధవారం బీసీసీఐ లో ప్రారంభం కానుంది. చిన్నస్వామి మైదానంలో ప్రేక్షకులు లేకుండా పోటీ నిర్వహిస్తామని కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ ప్రతిపాదించారు. దీనికి కర్ణాటక పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్రత్యామ్నాయంగా పోటీల వేదికను మార్చారు. ఇప్పటికే విరాట్ కోహ్లి తదితర కీలక ఆటగాళ్లు బెంగళూరు చేరుకుని ప్రాక్టీస్ ప్రారంభించడం గమనార్హం.






## డీజీపీ ఎదుట 22 మంది లొంగుబాటు

**మల్కాన్గిరి, ప్రజాస్వరం**

ఒడిశా మల్కాన్ గిరి జిల్లాలో మంగళవారం 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఒడిశా డీజీపీ వైబీ ఖురానీ, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో లొంగిపోయారు. మావోయిస్టులు తమ వద్ద ఉన్న 9 తుపాకులు, 150 రౌండ్ల మందుగుండు సామాగ్రి, 20 కిలోల పేలుడు పదార్థాలు, 13 ఐఈడీలు, జెలటిన్ స్టిక్స్, ఇతర వస్తువులు అప్పగించారు. లొంగిపోయిన మావోయిస్టులలో 19 మంది ఒడిశాకు చెందిన వారు, ఇద్దరు ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీకి చెందినవారు ఉన్నారని పోలీసులు తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసే మావోయిస్టులకు ప్రభుత్వం తరపున పునరావాసం కల్పిస్తామని డీజీపీ చెప్పారు.

## సీఐడీ విచారణకు మంచు లక్ష్మి, రీతూచౌదరి





**లక్డీకపూల్ , ప్రజాస్వరం**

బెట్టింగ్ యాప్స్ కేసులో సీఐడీ దూకుడు పెంచింది. సెలబ్రిటీల విచారణ వేగంగా సాగుతోంది. బెట్టింగ్ యాప్ కేసులో మంచు లక్ష్మి సీఐడీ విచారణకు హాజరయ్యారు. లకీకపూల్ లోని సీఐడీ కార్యాలయంలో మంచు లక్ష్మి విచారణకు హాజరయ్యారు. మంచు లక్ష్మితో పాటు బయ్యా సన్నీ యాదవ్, రీతూ చౌదరి విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్ కేసులో ఇప్పటికే పలువురు నటులను సీఐడీ ప్రశ్నించింది.

## జనవరి 3న సాయంత్రం

# నోటీసులు ఇవ్వమన్నారట

### కొందరు అధికారులు పోస్టింగుల కోసం అక్రమ కేసులు..

### అధికారులు సీఎం కోసం అతి చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

### మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్: కేసులు మాకు కొత్తకాదు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే 3వ తేదీ సాయంత్రం నోటీసు ఇవ్వమని చెప్పారట, సీఎం రేవంత్‌రెడ్డి కోసం అతిచేస్తే అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదు అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసుల వార్తలపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో సిట్‌లు ఒక ప్రహసనంగా మారాయన్నారు.

" కొందరు అధికారులు పోస్టింగుల కోసం అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారు.. ఏపీలో ఏం జరిగిందో అందరూ చూశారు కదా. రాజకీయ కక్షతో ఇబ్బంది పెడితే మీకూ అదే గతి పడుతుంది" అని హరీశ్ వ్యాఖ్యానించారు.



# నేను క్షమాపణ చెబుతున్నా

### దండోరా ప్రీరిలీజ్ ఈవెంట్ వేడుకలో శివాజీ అనుచిత వ్యాఖ్యలపై మంచు మనోజ్





**టాలీవుడ్, ప్రజాస్వరం**

నటుడు శివాజీ ప్రధాన పాత్రలో నటించిన 'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో .. నటీమణులు కొంచెం డ్రెస్ సెన్స్ పాటించాలని, ఇలా చెబుతున్నందుకు ఏమనుకోవద్దని చెబుతూనే, ప్రతిదానికి ఒక హద్దు ఉండాలన్నారు. శివాజీ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడంతో పలువురు మహిళలు, నటీనటులు తీవ్రంగా స్పందిస్తున్నారు. తాజాగా నటుడు మంచు మనోజ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. శివాజీ పేరు ఎత్తకుండా ఆయన తరపున మహిళాలోకానికి క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు.

**శివాజీ సలహాలు అవసరం లేదు: గాయని చిన్మయి..**

'అసభ్య పదాలను ఉపయోగిస్తూ తెలుగు నటుడు శివాజీ హీరోయిన్స్ కు ఉచిత సలహాలు ఇవ్వనవసరం లేదు. ఆయనేమో జీన్స్, హుడీ వేసుకున్నారు. మరి ఆయన చెప్పిన దాని ప్రకారం ధోతీ కట్టుకుని భారతీయ సంప్రదాయాన్ని అనుసరించాలి కదా. ఒకవేళ ఆయనకు వివాహమై ఉంటే బొట్టు, మెట్టెలు కూడా పెట్టుకోవాలి. అసలు మహిళలని ఇక్కడ ఎలా చూస్తున్నారో అర్థమవుతోంది' అని గాయని చిన్మయి పేర్కొన్నారు. నటుడు నవదీప్ కూడా ఈ వ్యాఖ్యలపై స్పందించారు. "దండోర' ఈవెంట్ లో చేసిన వ్యాఖ్యలు అగౌరవపరిచేలా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలతో అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ఆమోదయోగ్యం కాదు" అని అన్నారు.

**ఎల్లప్పుడూ గౌరవం, హోదా, సమానత్వం**


"ఇలాంటి ప్రకటన చేయడం తీవ్ర నిరాశకు గురిచేసింది. మహిళలు ఫలానా దుస్తులు మాత్రమే వేసుకోవాలి.. నైతికంగా ఇలాగే ఉండాలంటూ ఒక ఛత్రంలో పెట్టడం ఆమోదయోగ్యమైనది కాదు. గౌరవం, జవాబుదారీతనం వ్యక్తిగత ప్రవర్తన ద్వారా మాత్రమే వస్తుంది. దుస్తులను బట్టి ఎదుటివారిని ఎగతాళి చేయడం ద్వారా రాదు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కూడా రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉల్లంఘించడమే. సమానత్వం, గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో చర్చలకు తావులేదు. ప్రజల అభిప్రాయాల మేరకు మహిళలు దుస్తులు వేసుకోరు. వారిని అగౌరవ పరిచేలా సీనియర్ నటుడి చేసిన వ్యాఖ్యలకు ఆయన తరపున నేను క్షమాపణ చెబుతున్నా. మహిళలను వస్తువుల్లా చూడొద్దు. అయితే, అందరు ఆయనలా మాట్లాడతారని అనుకోవద్దు. ఇలాంటి వ్యవహారశైలిని ఉపేక్షించాల్సిన అవసరం లేదు. మహిళలకు ఎల్లప్పుడూ గౌరవం, హోదా, సమానత్వం ఇవ్వాలి. ఇలాంటి విషయాల్లో జవాబుదారీతనం అవసరం"అని మనోజ్ పేర్కొన్నారు.

## 'మా బాడీ మా ఇష్టం'

**యాంకర్, నటి అనసూయ**

**'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో శివాజీ వ్యాఖ్యలు వివాదాస్పదం**

నటుడు శివాజీ తన తాజా చిత్రం 'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చేసిన వ్యాఖ్యలు తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర చర్చకు దారి తీశాయి. నిన్న రాత్రి హైదరాబాద్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన నేటితరం హీరోయిన్ల గ్లామర్ ప్రదర్శనపై ఘాటు వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. మహిళల అందం చీరలోనే ఇమిడి ఉందని, అభ్యంతరకరంగా దుస్తులు ధరిస్తే అందులో విలువ ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికే గాయని చిన్మయి స్పందించగా, తాజాగా యాంకర్, నటి అనసూయ భ ర ద్వాజ్ కూడా శివాజీ వ్యాఖ్యలకు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన అనసూయ, "ఇది మా శరీరం.. మీది కాదు. మాకు నచ్చినట్లే మేము ఉంటాం" అంటూ స్పష్టం చేశారు. మహిళలకు తమకు నచ్చిన దుస్తులు ధరించే స్వేచ్ఛ ఉందని, వారి వ్యక్తిగత విషయాల్లో ఇతరులు జోక్యం చేసుకోవడం తగదనే అర్థం వ చ్చేలా ఆమె త న సోష ల్ మీడియాలో పోస్టులో పేర్కొన్నారు.



## ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌లతో జరజాగ్రత్త

**హైదరాబాద్, ప్రజాస్వరం**

హైదరాబాద్ సిటీ పోలీస్ సైబర్ క్రైమ్ యూనిట్ పౌరులను హెచ్చరిస్తుంది. సోషల్ మీడియా, టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపుల ద్వారా ఆన్ లైన్ ట్రేడింగ్ , ఇన్వెస్ట్ మెంట్ స్కామ్ లు గణనీయంగా పెరుగుతున్నాయని, క్రిప్టో కరెన్సీ, ఫారెక్స్, స్టాక్ ట్రేడింగ్ లో అత్యధిక లేదా గ్యారంటీ లాభాల పేరు చెప్పి సైబర్ నేరగాళ్లు అమాయకులకు టోకరా వేస్తున్నారని తెలిపింది.



పంజాబ్ కేడర్ కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి, రిటైర్డ్ ఇన్ స్పెక్టర్ జనరల్ అమర్ సింగ్ చాహల్ ఇలానే వాట్సప్ ఆధారిత పెట్టుబడి మోసానికి గురై సుమారు ₹8.10 కోట్లు పోగొట్టుకున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. 2 నెలల పాటు మోసగాళ్ల వలకు చిక్కి.. స్నేహితులు, బంధువుల వద్ద సుమారు రూ.7.5 కోట్ల మేర అప్పుగా తీసుకున్నారని తెలిపారు. తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికిలోనై చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. సైబర్ పెట్టుబడి మోసాల వల్ల కలిగే భయంకర పరిణామాలను ఈ ఉదంతం తెలియజేస్తోందని పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు నిర్ధారణ కాని పెట్టుబడి ప్లాట్ ఫారాలకు దూరంగా ఉండాలని, ఆన్ లైన్ లో లాభాలను చూపించే ప్రకటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు పౌరులకు సూచించారు.



ప్రధాని మోదీని అథ్లెట్ నీరజ్ చోప్రా దంపతులు కలిశారు. క్రీడలతో పాటు అనేక అంశాలపై చర్చించినట్లు ఎక్స్ లో ప్రధాని మోదీ పోస్ట్ చేశారు.
- న్యూఢిల్లీ, ప్రజాస్వరం